## క్లుప్తంగా

### కోవెలకుంట్ల తహసీల్దార్‌గా జయప్రసాద్



కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్‌గా జయప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇక్కడ ఫుల్ అడిషనల్ చార్జ్(ఎఫ్ఏసీ) తహసీల్దార్‌గా పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో జిల్లా కేంద్రంలోని ఎలక్షన్‌సెల్‌లో విధులు నిర్వర్తిస్తున్న జయప్రసాద్‌ను నియమించారు. ఆయన రెండు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

### సేంద్రియ వ్యవసాయంతోనే మంచి దిగుబడులు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్యాపిలి:సేంద్రియ పద్ధతిలో చేసే వ్యవసాయం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తహసీల్దార్ భారతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులతో పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మంచివి కావన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పెరట్లో ఆకుకూరలు, కూరగాయలు పండించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేష్, వెంకటప్ప, సంతోశ్, రవికుమార్, అభిషేక్ రాజ్ పాల్గొన్నారు.

### పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

కోవెలకుంట్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ కోవెలకుంట్ల డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష ఉన్న రోజుల్లో విద్యార్థులు వారి హాల్‌టికెట్‌ను చూపి ఉచితంగా ప్రయాణించి పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చన్నారు.

### వేలం పాట వాయిదా

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే పలు పనుల నిర్వహణకు మంగళవారం నిర్వహించనున్న వేలాలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతమార్కెట్, దినసరిమార్కెట్, బస్టాండ్ పనుల నిర్వహణ, కమేళాకు బహిరంగ వేలం పాట జరపాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామన్నారు. తిరిగి వేలాలు ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. వేలంపాటదారులు గమనించాలని సూచించారు.

### భూ కబ్జాపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ప్యాపిలి: తమ వ్యవసాయ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఊటకొండ గ్రామానికి చెందిన నారాయణస్వామి, సోమిరెడ్డి, రామిరెడ్డి, యశోదమ్మ సోమవారం తహసీల్దార్ భారతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఊటకొండ గ్రామంలో సర్వే నంబర్లు 44–1సీ, 44–బీ1, 41లలో తమకు 20 ఎకరాల పొలం ఉందన్నారు. తమ పొలాలకు ఆనుకుని సర్వే నంబర్ 44–బీ2లో ఉన్న చంద్రప్ప అనే వ్యక్తి తమ పొలాల్లో కొంత భాగాన్ని ఆక్రమించాడని వాపోయారు. సర్వే చేయించి తమ భూమిని తమకు ఇప్పించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

డోన్ రూరల్: మండల పరిధిలోని ధర్మవరం గ్రామం సమీపంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు పూజలు చేశారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. త్వరలోనే ఆయన నిర్మాణం పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

# వసతి గృహాల్లో సమస్యల తిష్ట

- పదుల సంఖ్యలో మరుగుదొడ్లు ఉన్నా.. ఉపయోగంలో ఉన్నవి సున్నా
- నీటి సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు
- కాలకృత్యాలకు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి





ప్యాపిలిలోని బీసీ బాలుర వసతిగృహం,వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



రాచర్లలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ప్యాపిలి: వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయి. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అసౌకర్యాల మధ్యే విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకునేందుకు ముళ్లపొదల చాటుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం ప్యాపిలిలోని బీసీ బాలుర వసతి గృహంలో 100 మంది విద్యార్థులు, జలదుర్గం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 89 మంది విద్యార్థులు, రాచర్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో 82 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మిస్తున్నా అవి కొన్ని రోజులు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. వసతిగృహాలకు నీటి సౌకర్యం లేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

స్వచ్ఛ భారత్ కింద నిర్మించిన మరుగుదొడ్లకు సైతం అధికారులు నీటి సౌకర్యం కల్పించలేకపోయారు. ప్యాపిలి ఎస్సీ బాలుర వసతి గృహంలో 18 మరుగుదొడ్లు ఉన్నాయి. అయితే మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో అవన్నీ ప్రస్తుతం నిరుపయోగంగానే ఉన్నాయి. అలాగే జలదుర్గం వసతి గృహంలో 17 మరుగుదొడ్లు ఉన్నాయి. ఇక్కడ నీటి సౌకర్యం ఉన్నప్పటికీ కొన్నింటికి తలుపులు విరిగిపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రాచర్ల వసతి గృహంలో దాదాపు 20కి పైగా మరుగుదొడ్లు ఉన్నా ఇక్కడ కూడా నీటి సమస్య కారణంగా మరుగుదొడ్లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్తున్నారు. ముళ్లపొదలు, పొలాల్లో విషపురుగుల బెడద ఉంటోందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వసతిగృహాల్లో నీటి సమస్య నెలకొన్న కారణంగా పలువురు వార్డెన్లు ట్యాంకర్ల ద్వారా తెప్పించిన నీటిని వంటకు, తాగడానికి, స్నానాలకు వాడుతున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు సమస్యలు లేకుండా చూస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వసతిగృహాలకు నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



నిర్వహణ లేకపోవడంతో తలుపులు విరిగిపోయి..

### నీటి సౌకర్యం కల్పించాలి



వసతిగృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలి. మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యం లేకపోతే ఏం ప్రయోజనం. లక్షలాది రూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లకు తక్షణమే నీటి సౌకర్యం కల్పించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాల బారిన పడతారు. ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులపై ఇలా వ్యవహరించడం సరికాదు.

–సూర్యప్రతాప్, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా సెక్రటరీ

### పనులు జరుగుతున్నాయి

ప్యాపిలిలో ఎస్సీ బాలుర వసతి గృహానికి మైనర్ రిపేర్లకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ నిధులతో బండపరుపుతో పాటు మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించే పనులు చేపడుతున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

–శ్రీనివాసగౌడు, బీసీ హాస్టల్ వార్డెన్, ప్యాపిలి

## పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలుకే



మార్ట్‌లో మహిళలతో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్

బేతంచెర్ల: పరిశ్రమలు, దుకాణాలు, ఎక్కడైనా సరే పిల్లలను పనిలో పెట్టుకుంటే రెండేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తామని డోన్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నీలిమ సంధ్య అన్నారు. సోమవారం బేతంచెర్ల పట్టణంలోని వందే మార్ట్‌తో పాటు కిరాణా, వస్త్ర దుకాణాలపై పోలీస్, ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. చదువుకునే వయసులో పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

ప్యాపిలి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలనిఅంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అధ్యక్షులు బేబిరాణి, మంజుల, ప్రధాన కార్యదర్శులు సుబ్బరావమ్మ, భారతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయడంతో పాటు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని నాడు కూటమి నాయకులు ఇచ్చిన హామీని గుర్తుచేశారు. సోమవారం విజయవాడలో జరగనున్న మహాధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న తమను ప్రభుత్వం ఎక్కడికక్కడ నిర్బంధించిందన్నారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## 13న జాబ్ మేళా



జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫోక్స్‌కాన్, యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మాలవికాస డెవలపర్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా ఏర్పాటు చేశారన్నారు. పదో తరగతి, ఇంటర్,ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్, కడప, తిరుపతి, నంద్యాల, పాణ్యం, అవుకు ప్రాంతాల్లో ఉద్యోగాలు కేటాయిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.వివరాలకు 9705998056, 8688651650 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. 530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిమ్మనాయినపేటలో అదనంగా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల పాఠశాల విద్యార్థులు కొలిమిగుండ్లకు పరీక్షలకు హాజరయ్యే సమయంలో రవాణాలో ఇబ్బందులు ఏర్పడుతుండటంతో కొత్తగా అక్కడ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్ష కేంద్రాలకు సంబంధించి ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల నియామక ప్రక్రియను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

## ప్యాపిలి జెడ్పీటీసీ సభ్యుడి మృతి



బోరెడ్డి శ్రీరామిరెడ్డి (ఫైల్)

ప్యాపిలి: ప్యాపిలి జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి (68) సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఫిబ్రవరి 28వ తేదీ వాకింగ్ వెళ్తున్న ఆయన్ను స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో గాయపడ్డారు. కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హైదరాబాదులో బోరెడ్డి శ్రీరామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. శ్రీరామిరెడ్డికి భార్య పద్మావతమ్మ, కుమారుడు గోపి, కుమార్తె మమత ఉన్నారు. వివాదరహితుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన శ్రీరామిరెడ్డి మృతిపై ప్యాపిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సాంకేతికత అందిపుచ్చుకోవాలి



నంద్యాల వ్యవసాయ పరిశోధన సంచాలకుడు జాన్సన్

బనగానపల్లెరూరల్: వ్యవసాయంలో రైతులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికత అందిపుచ్చుకోవాలని నంద్యాల వ్యవసాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ జాన్సన్ సూచించారు. సోమవారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు గత ఏడాది ఎదుర్కొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించేందుకు శాస్త్రీయ సలహాల మండలి సమావేశాలు దోహదం చేస్తాయన్నారు. ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ . ఉపసంచాకుడు ముకుందరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ.. రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ కేవీకే కార్యక్రమాలు, ప్రగతిని వివరించారు.

### నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: ప్రజా రవాణా సమస్యలపై స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

### సమాజంలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ రూరల్: సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్ర కీలకమని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు కష్టం వస్తే ఆదుకోవడానికి చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. మహిళలు ఎప్పుడైతే ధైర్యంగా ముందుకు అడుగువేస్తారో అప్పుడే విజయం సాధించగలరని చెప్పారు. వేధింపులకు గురైతే పోలీస్‌స్టేషన్, కోర్టులను సంప్రదిస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. చిన్నతనంలో పెళ్లిలు చేయడం నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

### హిందువులపై దాడులను ఖండించాలి

డోన్ టౌన్: రాయచోటిలో ఈ నెల 4వ తేదీ వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో హిందువులపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కోరారు. సోమవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ నరసింహులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆ సమయంలో హిందువులపై అమానుషంగా లాఠీచార్జ్ చేసిన ఎస్ఐ నరసింహారెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

### వేలం పాట వాయిదా

ప్యాపిలి: మేజర్ పంచాయతీ పరిధిలోని వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్, మాంసపు మార్కెట్‌లకు మంగళవారం నిర్వహించనున్న వేలం పాటలు వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి ఆకస్మిక మృతి కారణంగా వేలం పాటను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

### వెంకటాపురం యువకుడికి డాక్టర్ పట్టా



గోపాల్‌రెడ్డితో కుటుంబ సభ్యులు

డోన్ టౌన్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనితా దంపతుల కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేయడంతో ఈ నెల 9వ తేదీ సర్టిఫికేషన్ ఆఫ్ గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న నెల్లూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు.

## విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేసే కుట్ర



ఫీజు పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు
- ఫీజు పోరుబాట వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

డోన్: పేద పిల్లలు ఉన్నత చదువులు చదవకుండా కూటమి ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు దిగుతుండడం శోచనీయమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ అన్నారు. సోమవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 12వ తేదీ తలపెట్టిన ఫీజు పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టగా, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలను విద్యార్థులకు అందించడం ద్వారా ఉన్నత చదువులకు అవకాశాన్ని కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాలల యాజమాన్యాలకు పెండింగ్‌లో ఉన్న ఫీజుల మొత్తాన్ని చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువులు మానేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగా 10వేల మెడికల్ సీట్లను పెంచుకునే అవకాశం కల్పించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విద్యా విధానాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. ప్రైవేటు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి, విద్యాదీవెనల మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమ్మ ఒడి పథకాన్ని రద్దు చేయకుండా సత్వరమే నిధులు విడుదల చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి, నాయకులు కురుకుంద హరి, కుమ్మరి రాజు, భాస్కర్, పాలుట్ల రఘురాం, వెంగల్ రెడ్డి, పండు, డీలర్ మల్లికార్జునరెడ్డి, ధారా ప్రతాప్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, రఫి, గ్యాస్ రాజు, నాగిరెడ్డి, వెంకటేష్, ఎల్లేశ్వర్, రవి, మహేష్ పాల్గొన్నారు.

### 15న చౌడేశ్వరి ఆలయంలో వేలం పాట

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ, షామియానాలు, వంటపాత్రల సరఫరా హక్కు కోసం ఈ నెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. జ్యోతి ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

### నాటుసారా నిర్మూలనే లక్ష్యం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి

డోన్: పేదల ప్రాణాలను హరిస్తున్న నాటుసారా విక్రయాలను సమూలంగా అరికట్టి వారి కుటుంబాల్లో నవోదయాన్ని నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఆర్థికంగా నష్టపోయి కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల్లో నాటుసారా వల్ల కలిగే అనర్థాల గురించి అన్నిశాఖల అధికారులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ప్రైవేట్ విద్యాసంస్థలపై ఫిర్యాదు



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల: మండలంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్‌కు వినతిపత్రం అందజేశారు. మౌలిక వసతులు, ఆట స్థలం లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శేఖర్, నారాయణ రెడ్డి, చందు, సాగర్, మహేష్, సాయి ఉన్నారు.

### పూలే సేవలు చిరస్మరణీయం

డోన్ టౌన్: మహిళల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఏఈ నాగరాజు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో జ్యోతిరావు, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు నివాళులర్పించారు.